# మనిషి ఖరీదు

జనరల్ ఆస్పత్రి ప్రహరిగోడకి అనుకుని వున్న ఆ పెద్ద మర్రిచెట్టు, ఊడలు దిగిన ఆ మహావృక్షం ఆ అమావాస్య చీకటి రాత్రిలో జుత్తు విరబోసుకున్న దెయ్యంలా వుంది. ఝూంమని కొమ్మలగుండా దూసుకు వచ్చే గాలిశబ్దం వికటాట్టహాసం చేస్తున్నట్టుంది. ఎండు టాకులు చేసే గలగల శబ్దం దెయ్యాలు గుసగుసల్లా వుంది. ఆ చెట్టుక్రింద బీద బిక్కీ వండుకోడానికి చేస్తున్న చితుకుల మంటలు కొరివిదెయ్యాల్లా అగుపిస్తున్నాయి. ఆ పొయ్యిలమీద ఉడుకుతున్న అన్నాల కుతకుతలు దెయ్యాలు నిట్టూరుస్తున్నట్టు వుంది.

ఆ చెట్టు కింద జుత్తు విరబోసుకుని కూర్చున్న ముత్యాలు నల్లని శరీరం ఆ మంటల ఎరుపుకి కాలిన ఇనుములా మెరుస్తూంది. ఏడ్చిఏడ్చి ఎర్రబడిన ఆమెకళ్లు రెండు నిప్పుకణికల్లా మెరుస్తున్నాయి. అక్కడ మండుతున్న పొయ్యిలు లాగే ఆమెగుండెలు మండుతున్నాయి. అక్కడుడుకుతున్న అన్నాల మాదిరి ఆమె హృదయం కుతకుత లాడుతూంది. ఆమె ప్రక్కన నల్లటి మాసిన గుడ్డపీలికల మీద నల్లటి బల్లి గోడని కరుచుకున్నట్టు బోర్లపడుకునుంది చంటిపిల్ల. ఆ పిల్లకి కాస్త దూరంలో చీకేసిన తాటిటెంకలాంటి తల, పుల్లలు తెచ్చి కాళ్ళు చేతులు అంటించినట్లున్న రెండేళ్ళ పిల్లాడు గీ అంటూ ఏడవడానికి కూడా ఓపిక లేనట్టు సన్నగా మూలుగుతూన్నాడు. ముత్యాలు తన కళ్ళనించి జారే నీటిని తుడుచుకోడం లేదు. ఏడుస్తున్న పిల్లాడి కళ్ళనీళ్ళని తుడవడంలేదు. ఆమె ఎటూ చూడ్డం లేదు. ఎటో చూస్తూంది శూన్యంలోకి.

ఆ చెట్టుక్రింద మిగతావాళ్ళు ముత్యాలునే చూస్తూ గుసగుస లాడుకుంటున్నారు. ఏటొసే అప్పా ....ఆ ముత్యా లలా కూకుండిపోయింది

పొద్దున్నరడనించి.... అప్పాయమ్మ నరసాయమ్మతో అంది.

"పెద్దదుఃఖం ఎల్లబోస్తంది సేసిన ఎదవపని సేసేసి ఏడు పెందుకో... పగలు పోతూంది. ఎవరికీతెలియుదు దీని సంగతి మెటికలు విరిచింది సింహాచలం"

"అవునప్పా, నాకుతెలవక అడుగుతా దీని సేతులు ఎలా వచ్చా యప్పా మొగుడ్ని అమ్మకోడానికి! .... ఎంతడబ్బు నేకపోయినా డబ్బుకి యింతపని సేస్తామా ! ఓలమ్మో.... యిది ఆడ కూతురు గాదు, రాకాసి" అంటూ ఆశ్చర్యపోతూ గుండెలు పదోసారి బాదుకుంది నరసాయమ్మ

"వల్లకొండే.... డబ్బే....డ బ్బే... దానిముందర మొగుడేంటి పెళ్ళామేంటి, కూతురేంటి, కొడుకేంటి" పొయ్యిలొంచి కొరకంచు తీసుకుని బీడీ ముట్టించుకుంటూ వేదాంతం, లోకధర్మం, ధర్మపన్నాలు చెప్పాడు పీరాయి.

ఒటేలు పెడ్తుందిట ఒటేలు, ఆ డబ్బుతో ఒటేలెట్టి లచ్చలు సంపాది స్తుంది గాబోలు అ డబ్బుతో.... ఇంత కాపీన్నం తగదు....ఛీ....ఎదవ బతుకు.... ఇలాంటోళ్ళ మొగంచూస్తే పాపంవస్తుంది. మాణిక్యం తుపు క్కు-న ఊసింది"

"నిజమేనవ్వా....ఆడకూతురు కష్టంలో వుంది అని జాలి కూడా నూపబుద్దియడం లేదు దాని మొగం సూస్తే..... సూడే ఎలా పొర్రిపొర్రి సూస్తుందో...." నరసాయమ్మ అంది అసహ్యంగా చూస్తూ.

'ఆ....ఏసకాలు, పెద్దదుఃఖం వొలకబోస్తంది. దీని కల్లబొల్లి ఏడ్పుల కేంలే, నిజంగా అంత ఏడుపుంటే అంత పని సేయనేసేయదు' మెటికలు మరోసారి విరిచింది సింహాచలం.

"దీనికి పత్తాసు ఆ యీరమ్మముండ. తప్పేటి అంటుంది పైగా....

ముసలినంజ టీకొట్టెట్టిస్తుందట దానిసేత" కోపంగా అంది అప్పాయమ్మ.

"పోన్లెండే....దాని వూసు మనకెందుకు.... దానిపాపం దానిదే...." జోగులు తలగుడ్డ దులిపి క్రింద పరుచుకు పడుకుంటూ అన్నాడు.

'మనకేటి అని వూరుకోబుద్ధి పుట్టదన్నా.... యిది సేసిన ఎదవపని తలుచుకుంటే....' సింహాచలం మహాబాధగా బాధపడ్తూ అంది.

"వూరుకోక నీ వేటి సేస్తావు అప్పా, ఎవురిగోల ఆళ్లది యీ లోకంలో.... దానికట్టం దానిది మనకేల" అన్నాడు పైడయ్య. మన అప్పా, సెల్లా, ఎవురికెవరం? ఏదో యీ చెట్టునీడన అందరం ఒకే ఇంట్లోలా వున్నాం గనక దాని సంగతి మనకెందుక. నేకపోతే రోజుకి ఇలాంటి వెన్నో.... ఎవరి సంగతి ఎవరికెరిక ఈ పెపంచకంలో! .... అన్నాడు మహా ఉదారంగా ధర్మంగా.... వూడిపోతున్న కాలివేళ్ళకి, చేతులో గుడ్డపీలికలు బిగించి కట్టుకుంటూ. అందరూ కాసేపు గొణుక్కుని, గొణుక్కుని వూరుకున్నారు.

ఆ చెట్టు.... ఆ మహావృక్షం.... తన నీడన ఎందరికో ఆశ్రయం ఇచ్చింది. ఇస్తూంది.... అడుక్కుతినేవాళ్ళు కొంప గోడులేని కూలి నాలి చేసుకునేవాళ్ళే కాక ఆస్పత్రికి వచ్చే బీదజనం తమవాళ్ళని ఆస్పత్రిలో జాయిన్ చేసి ఆ చెట్టుక్రింద వండుకుతింటూ రోగిని చూసుకుంటూ పడివుం టారు. ఏ తల్లికో, కొడుక్కో, భార్యకో జబ్బుచేస్తే ఆ ఆస్పత్రిలో జాయిన్ చేసి వాళ్ళ రోగం తగ్గేవరకు ఆ చెట్టుక్రిందే వండుకుంటూంటారు. అలా ఎప్పుడూ కనీసం నలుగు రైదుగు రుంటారు. ముష్టివాళ్ళు సరేసరి! రోజంతా ఎక్కడో అడుక్కుని సాయంత్రం అయ్యే సరికి ఇన్ని చితుకులు పోగు చేసుకుని ఆ చెట్టుక్రింద ఇంతగంజి కాచుకు త్రాగి, గుడ్డ పరుచుకుని పడు కుంటారు. మరీ నిలవలేని వర్షంవస్తే ఏ అరుగుమీదో తలదాచు కుంటారు. అలా నిలవనీడలేని నిర్భాగ్యులకి ఎందరికో ఆ చెట్టు ఆశ్రయం ఇస్తూంది.

వాళ్ళల్లో ముత్యాలొకర్తి! ముత్యాలు బ్రతుకు యిప్పుడు బండ

అయింది. కాని నాలుగు నెలలు క్రిందట ముత్యాలు.... నిగ నిగలాడుతూ నల్ల ముత్యంలా మెరుస్తూండేది. మొగుడు పాలేరు పని చేస్తూంటే ఇంట్లో గంజి కాచి ఇద్దరు చంటిబిడ్డలతో చీకూ చింతా లేకుండా వున్నంతలో హాయిగా, బ్రతకడం దేముడు చూడలేక పోయాడు. అందుకే రోగం రూపంలో ముత్యాలు మొగుడిని వెంటాడాడు. పోలిగాడు మంచానపడితే గచ్చాకు, పుచ్చాకు వైద్యం, మంగలివైద్యం నెలరోజులు తనకుతెల్సిన వాళ్ళు వీళ్ళు చెప్పిన వైద్యాలన్నీ చేయించింది. అమ్మోరికి మేకపోతును బలిఇస్తానని మొక్కుకుంది. జాతరకి కోడిపెట్ట నిచ్చింది. తా యెత్తులు కట్టింది. ఈ లోపల రెండోనెలా గడిచింది. ఈ రెండునెలల్లో నానాయాతన పడి, ఊడ్పులకెళ్ళి, కోతలకెళ్ళి, కామందు జాలిపడి ఇచ్చిన గింజలతో ఎలాగో రోజులు నెట్టింది. మరి ఈ రోగం యిక్కడతగ్గదు పట్నం తీసికెళ్ళాల్సిందే అన్నారు వూళ్ళో అందరూ....ముత్యాలు గుండె గుభిల్మంది. ఆడకూతురిని, సంటి పిల్లలతో, రోగిష్టి మొగుడ్ని పట్నం తీసికెళ్ళి ఎక్కడ కెళ్ళను, ఏం చెయ్యను, ఏంపెట్టి వైద్యం చేయించను దేముడో అని బెంబేలుపడి పోయింది. వూరివాళ్ళు ఓదార్చారు. వైద్యం వూరికే చేసే ఆస్పత్రులున్నా యని ధైర్యం చెప్పారు. వివరాలుచెప్పారు. కామందు కాళ్ళ వేళ్ళ పడి ఏభై రూపాయలు అప్పుతో రోగిష్టి మొగుడితో, ఇద్దరుచంటి పిల్లలతో పట్నం చేరింది ముత్యాలు.

పట్నం చేరాక ఆస్పత్రి గేటులోంచి లోపలికి వెళ్ళటానికి రెండు రోజులు. లోపలికెళ్ళాక యిక్కడకాదు, అక్కడ, అక్కడ కాదు మరో డిపార్టుమెంటు అంటూ ఏవేవో పరీక్షలుచేసి వారంరోజులకి పోలిగాడ్ని ఆస్పత్రిలో జాయిన్ చేసుకున్నారు. ఆ వారంరోజులు ముత్యాలు పడిన అవస్థలు చెపితే అదో భారతం అవుతుంది. తిరగనివాడ్డు లేదు. చూడని నర్సు లేదు. కాళ్ళు పట్టని డాక్టరు లేడు; ఆఖరికి వారంరోజులకి బెడ్ దొరికింది. అప్పటినుండి పరీక్షలు ఆరంభించారు. గుండెలు చూశారు. కడుపు నొక్కారు

ఫోటోలు తీశారు. రక్తం తీశారు. మలమూత్రాలు పరీక్షించారు. ఒక్కొ-క్కళ్ళు వచ్చి ఒక్కోసారి రోగంపేరు చెప్పారు. కానీ అంతా కలిసి ఒకే పేరు చెప్పనందున పోలిగాడి రోగం ఏమిటో నెలరోజులు గడిచినా తేలలేదు. తేలకుండానే మందులు ఆరంభించారు. ఇంజక్షన్లు పొడిచారు. ఈ లోపల పోలిగాడు మరింత శుష్కించి పోసాగాడు. అతని శరీరంలో మిగిలిన రక్తం కాస్తా పరీక్షలకే సరిపోతూంది. ఇంజక్షన్లతో అతని శరీరం కన్నాలు పడి పోగా మిగిలింది ఏమీలేదు. డాక్టర్లు మరోసారి పరీక్షలు చేశారు. మందులు మార్చారు.... రోజురోజుకీ పోలిగాడి స్థితి దిగజారి పోతూంది.

ఆస్పత్రిలో పోలిగాడి అవస్థ ఓఎత్తు, ఆ రెండు నెలలు ముత్యాలు ఇద్దరు పిల్లలని పెట్టుకుని పడ్డపాట్లు మరోఎత్తు. వెంట తెచ్చుకున్న ఏభై రూపాయలతో ప్రయాణం ఖర్చులుపోగా మిగిలింది పది రోజుల తిండికి కూడ సరిపోదు. అప్పటినించి ముత్యాలు అవస్థలు దేముడి కెరిక. రోగిష్టి మొగుడ్ని వదిలి వెళ్ళ లేక, వదిలి వెళ్ళి అక్కడా రెక్కల కష్టంతో తప్ప బ్రతకలేదు కనక ఆ రెక్కల కష్టం ఇక్కడే పడదాం అనుకొంది. కాని ఈ రోజుల్లో కూలి పని దొరకడము అంత సుళువు కాదని చాలా త్వరలోనే అర్థం అయి పోయింది. రెండిళ్ళ పాచి పనికి కుదురుకుంది ముత్యాలు. చంటి పిల్లలు ఆ చీదరఅంతా మాకొద్దని నాలుగు రోజులలోనే స్వస్తి చెప్పారు ఇళ్ళవాళ్ళు. దొరికిననాడు కూలి పని చేసుకుంటూ, ఇంత గంజి త్రాగుతు, మొగుడి రోగం తగ్గడం కోసం వెయ్యి దేముళ్ళకి దండాలు పెట్టుకుంటూ రోజులు దుర్భరంగా గడిపింది ముత్యాలు. పెళ్ళాం పిల్లల పస్తులు చూడలేక పోలిగాడు నిస్సహాయంగా కళ్ళ నీళ్ళు పెట్టుకునే వాడు. ముత్యాలే ధైర్యం చెప్పేది "వూరుకో మామా.... నీకు రోగం తగ్గాలే కాని, యాకట్టాలు కలకాలం వుండవులే అని ఓదార్చేది. భార్య బిడ్డల దీనావస్థను చూడలేక పోలిగాడు ఆస్పత్రిలో తనకిచ్చే రొట్టె పాలు ఒకపూట రొట్టె తిని పాలు దాచి, మరో పూట పాలు త్రాగి రొట్టె దాచి ముత్యాలు చూడడానికి వచ్చినపుడు

ఇస్తూండే వాడు. రోగిష్టి వాడికి పెట్టేది లేక పోగా వాడిది తినడమా అని మధన పడ్డా, ఆకలికి తలొగ్గక తప్పేది కాదు ముత్యాలుకి. ఏ నర్సూ చుట్టు ప్రక్కల లేనపుడు రొట్టె తీసి పెళ్ళం కిచ్చేవాడు. దాచిన పాలు త్రాగ మనే వాడు. ముత్యాలు గబుక్కున ఇన్ని పాలు తన నోట్లో పోసుకుని మిగతావి పిల్లాడి నోట్లో పోసేది. రొట్టె రొంటిని భద్రంగా దోపుకునేది. 'మావా, నీకో' అనేది దైన్యంగా. వద్దే, తిని తిని నా నోరు నచ్చిపోనాది, రెండు పూటలా ఆ పాలు తాగితే అరాయించుకో లేనే అనే వాడు. నిజమే ఆ ఒక్కటి పాలు త్రాగి హరాయించుకునే శక్తి కూడా లేదు పోలిగాడికి. వుంచేసిన పాలు రొట్టె చూసి ఏ నర్సన్నా కేకలేస్తే 'తాగుతానండమ్మా కొంసంత అగి. ఆకలిలేదు' అని అబద్ధాలాడి సాయంత్రం ముత్యాలు రాగానే ఆ పాలు యిచ్చేవాడు. ఆరొట్టె, ఆ ఒక్కటి పాలే ముత్యాలుని పిల్లలని ఆకలిబాధ పడకుండా రక్షించాయి....

రోగం ఎప్పుడు తగ్గుతుందా ఊరి కెప్పుడు వెళతామా, అని కళ్ళల్లో వత్తులు వేసుకుని రోజూ దేముణ్ని ప్రార్థించేది ముత్యాలు ఆ రోజు కోసం.

ఓ రోజు....ఆ రోజు వచ్చింది. అయితే రోగం తగ్గింది తీసుకు పొమ్మని చెప్పలేదు డాక్టర్లు. నీ మొగుడి రోగం తగ్గదు... లాభం లేదు తీసుకుపో, ఇంకేమన్నా పెద్ద పట్టణం ఆస్పత్రికి పట్టుకెళ్ళు. అని చెప్పేశారు ....ముత్యాలు గుండె ఆగిపోయింది. బాబూ దిక్కు మొక్కు లేనిదాన్ని, చేతిలో కానీ లేనివాన్ని, యీ కదల్చలేని రోగిని ఎక్కడికి తీసికెళ్ళను, ఏంచెయ్యను, మీరే దయచూడాలి. మీరే దిక్కునాకు అంటూ పెద్ద డాక్టరు కాళ్ళు పట్టుకుని వల వల ఏడ్చింది డాక్టరు జాలిపడ్డాడు, 'నీ మొగుడి ప్రాణానికి హామీ యీయలేం-కానీ మా చేతనయింది మేముచేస్తాం.... ఆపైన నీ అదృష్టం. చివరి వరకు మా చేతిలో ఉన్నది చేస్తాం వుంచు' అన్నాడు. ఆ మాత్రం చాలనుకుంది ముత్యాలు.... తన అదృష్టం ఎలా వుంటే అలా జరుగుతుంది. అని గుండె దిటవు పరుచుకుంది.....ధైర్యం చెప్పుకుంది.

ఆ కష్ట సమయంలో ముత్యాలుకి ధైర్యంచెప్తుతూ తల్లీ తోడులా ఆదుకుంది వీరమ్మ ఒక్కతే. ఆ చెట్టుక్రిందే వీరమ్మ నివాసం! వీరమ్మ ఒక్కగాని ఒక్క కొడుక్కి క్షయ. వీరమ్మ కొడుకుని ఆస్పత్రిలో చేర్చి, రెండిళ్ళలో పాచిపని చేస్తూ కొడుకు కోసం ఆ చెట్టుక్రిందే పడుంటూంది మూడు నెలలుగా. వీరమ్మ కొడుకు రోగం తగ్గుతూ, హెచ్చుతూ హెచ్చుతూ తగ్గుతూ అతనితో ఆటలాడుతూంది. వీరమ్మ వంటరిది, వెనకా ముందు లేనిది. ఎక్కడున్నా ఏం చేసినా అడిగేవారు లేరు. ఆ చెట్టుక్రింద వుంటూ రెండిళ్ళలో పని చేసిన డబ్బుతో తన పొట్ట నింపుకుంటుంది. పసి పిల్లలతో ఆ చెట్టుక్రింద చేరిన ముత్యాలు అవస్థలు చూస్తూ బాధపడేది. ముత్యాలు పిల్లల ఏస్థులు చూడలేక తను తినే ముద్దలో రెండు ముద్దలు పెడ్తుండేది. చల్ది అన్నం తెచ్చుకుని తింటూ పిల్లాడికి రెండుముద్దలు పెట్టేది. ఏడ్చే ముత్యాలుని ఓదార్చి ధైర్యం చెప్పేది. ఆ కష్ట సమయంలో తల్లిలా ఆదుకున్న వీరమ్మని చూసి మనుష్యుల్లో దేవత అనుకుంటూ దండంపెట్టేది ముత్యాలు.

ఆ చెట్టుక్రింద ఇవాళున్న వాళ్ళు రేపు కనపడరు. రేపు మరొకరు! అంతా రెండు రోజులుండి పోయేవాళ్ళే! అలా కాక రెండేసి మూడేసి నెలలు వుండే వారు ముత్యాలు వీరమ్మల లాంటివాళ్ళు ఇద్దరు ముగ్గురు, ఆ చెట్టే శాశ్వత నివాసంగా ఏర్పరుచుకున్న ముష్టివాళ్ళు ముగ్గురు నలుగురున్నారు. అలాంటి వాళ్ళందరికి ముత్యాలు ఇప్పటి స్థితి లోకువ అయింది. నోటి కొచ్చినట్లు చెప్పుకున్నారు.

ఆ మాటలన్నీ ముత్యాలు చెవులో దూరుతూనే వున్నాయి వింటూ భరించ లేక ఏమన లేక కుళ్ళి కుళ్ళి ఏడుస్తూంది. అసలే దబ్బతిన్న ఆమెకి ఆమాటలు భరించే శక్తి మిగలలేదు. నిస్సహాయంగా ఏడవడం మినహా ఏం చెయ్యలేక పోయింది.

* * *

ముత్యాలు... ముత్యాలు... ఏటలా సూత్తావు లే కూడొండాను రెండు ముద్దలు తిందువుగాని లేచిరా, పొద్దుటేలనించి పచ్చి మంచి నీళ్ళు

ముట్టనేదు, గొంతెండి పోతది! లే ...ఆ గుంటడిని కూడ నేపు. వీరమ్మ బుజం మీద చెయ్యి వేసి తట్టి పిలిచింది. వీరమ్మ బజారునుంచి ఎప్పు డొచ్చిందో, కూడు ఎప్పుడు వండిదో ప్రక్కన ఏడుస్తున్న కొడుకు ఏడ్చి ఏడ్చి ఎప్పుడు నిద్రపోయాడో.... అలా కూర్చునేవున్న ముత్యాలికి తెలియలేదు.... వీరమ్మ పలకరిస్తే వెర్రిదానిలా చూసింది....

"ఏటే....అలాసూస్తావు ... ఇందా కనగా వచ్చా ...కూచుని జోగు తున్నావు నన్ను సూడనేదా... లే.... బేగి రెండు ముద్దలు తిని పడుకుం దువు గాని...."

ఇప్పటికి తెలివివచ్చింది ముత్యాలుకి. వీరమ్మని పట్టుకుని 'అప్పా' అంటూ భోరుమంది. ఇందాకటినించి కడుపులో దాచుకున్న దుఃఖం అంతా బయటపడింది.

"స్, వూరుకోయె .. ఏంత ఏడిసి ఏటి నాబం...." వీరమ్మ ఓదా ర్చింది.

"అదికాదప్పా.... అల్లు! అల్లందరూ ఇందాకటి కాడనించి ఏన్నెన్ని మాటలంటన్నారో....నాను మొగుడ్ని అమ్ముకున్నానంట, నే నాడ దాన్ని కానంట, రాకాసినంట.... నాకు పుట్టగతి నేదంట .. నే నేం తప్పు సేసాను అప్పా...." వెక్కి వెక్కి ఏడ్చింది. సంగతి అర్థం అయి దూరంగా కూర్చుని అన్నాలు తింటున్న వాళ్ళందరిని నిర్లక్ష్యంగా చూసింది. వీరమ్మ.

"అనుకోనియ్యే.... అంతే నీకేటి పోయింది.... అల్ల మాటల కేంటి...."

"అప్పా....వద్దప్పా... అడ్ని తెచ్చేస్తానప్పా.... నాకా డబ్బు వద్దప్పా...." ఏడుస్తూ అంది ముత్యాలు.

"ఎఱ్ఱిమొగమా ... అల్ల మాటలకేటి, ఈ అనోళ్ళందరూ నీకు పూటన్నా కూడేత్తారా ?.... యిన్ని గంజినీళ్ళన్నా పోస్తారా.... ఆ డబ్బెట్టి ... చిన్న టీకొట్టెట్టుకొందువుగాని, నీ పిల్లలకింత గంజికాచి పోసు కుందువు గాని, నీ మొగుడు ఆలోచించే చెప్పాడు ..."

అవునప్పా, ఆడు పట్టుబట్టి బలవంత పెట్టాడు. వద్దు మావా అని ఏడ్చాను, తప్పు.... పాపం అని బ్రతిమలాడాను. ఇన్నాడు కాదు. ఏ తప్పు లేదు. ఎందరో ఇలా సేస్తారు. అని మాటిచ్చేవరకు ఒగ్గాడు కాడు. నేకపోతే డబ్బు కానపడలే దప్పా నేను" అంటూ మళ్ళీ ఏడ్చింది.

"ఊరుకుంటవా సేదా, ఎక్కడో ఎఱ్ఱి మొగంలా వున్నావు. నీ మొగుడు చెప్పాడు, నీవు చేసావు. ఊల్లు అల్లు అనే మాటలకి నీ వెందుకు ఏడుస్తావు? చాల్లే....లే ఇంక, ఇంత గంజి త్రాగుదువు గాని. వీరమ్మ కసిరి ముత్యాలుని లేవదీసి మూకుడు ముందు కూర్చోపెట్టింది.

కాలి బూడిద అయినా, ఏ ముక్క కాముక్క కోయబడినా పోలిగా డికి ఏ బాధా కలగదు గానీ, పోలిగాడి ఆత్మమాత్రం పెళ్ళాం పిల్లలు ఆకలికి మాడకుండా వుండడం కోరుకుంది! బ్రతికి నన్నాళ్లూ ఏనాడూ పెళ్ళాంచేతిలో రెండు రూపాయల కంటె పెట్టలేని పోలిగాడు చచ్చిపోయి ఒక్కసారిగా పాతిక రూపాయిలు సంపాదించి పెట్టగలిగి నందుకు ఎక్క డున్నా సంతోషిస్తాడు!

(జయశ్రీ పత్రిక నుండి)